# బసితేన్నవటి సడిమీద బూతుబొమ్మలు

**సూరిబాబు కమ్మరికొలుం జమ్మిచెట్టు అవతల శ్మశానానికెళ్ళే దారిలో ఉంది. కత్తులూ, కొడవళ్ళు బండిచక్రం ఇరుసులు చేస్తుంటారు సూరిబాబు కుటుంబంలో మనుషులు. వాళ్ళ తాతముత్తాతల్నించీ అదే పని. అయితే ఆళ్ళందరికంటే సూరిబాబు బాగా పేరెల్లి పోయాడు. ఎందుకంటే పందెం కోళ్ళకాళ్ళకి కత్తులు తయారుచెయ్యడంలో ఈడు బాగా ఫేమస్ అవడం వల్ల అంతా అప్పాబత్తుల సూరిబాబు అని పిలవడం మానేసి కత్తుల సూరిబాబు అని పిలుస్తుంటారు.**


మా ప్రాంతంలో ఎక్కడ కోడిపందాలు జరిగినా పందెం కోడిని చంకలో పెట్టేసుకుని బయలుదేరి పోయే బాబ్జీ సూరిబాబూ మంచి ఫ్రెండ్సు. బుల్లెట్టు బండి బాబ్జి సొంతమేగాని నడపడం రాదు. సూరిబాబు నడుపుతుంటే కోడిని పట్టుకుని వెనక కూర్చుంటాడు బాబ్జీ. ఒక్క కోడిపందాలేగాకండా ఇంకా చాలా పందాలు కాస్తుంటాడు బాబ్జీ. మున్సబుగారితూము దగ్గరున్న మీసాలక్రిష్ణకాఫీ హొటేల్లో ఇడ్లీల పందాలు జరుగు తుంటాయి. అదెలాగంటే ఏభై ఇడ్లీలు అరగంటలో తినేసే తిండిమోతు ఎదవ ఒకడుంటాడు. ఆడు అరగంటలో తినలేడు అని ఒక గుంపు, తినగలడెహె అని ఇంకో గుంపు పందాలు కాసుకుంటారు. పందాలు కాసేది రూపాయి పాపాయిల్తో కాదు వేలకి వేలు పోసి. ఇంకా, గుడ్డిపట్టాభి కిళ్ళీకొట్టు దగ్గర అరిటిపళ్ళ పందెం, నరాలపాలెంలో కల్లు పందెం.

ఓ పది పదిహేనేళ్ళగా ఈ పందాలమీద సంపాయించిన సొమ్ముతో ద్రాక్షారానికి ముందున్న అంబడిపాలెంలో పాతికెకరాలపొలం కొన్నాడు బాబ్జీ.

* * *

నవంబరు నెల. ఒకటే చలి.

మంచుని చిక్కగా కప్పేసుకునుంది మా ఊరు.



ఆరోజు సుబ్బారాయుడి షష్ఠి. ఊళ్ళో ఆడోళ్ళంతా కాలవకాడ ఆంజనేయస్వామి గుడెనక పామంచాల్లో దిగి స్నానాలు చేస్తున్నారు.

అందరు ఆడోళ్ళతో పాటు నీళ్ళలో మునిగిన ఓ అందమైన ఎర్రటి పిల్లకూడా స్నానం చేసి ఎర్రకంకర్రోడ్డు దిగి ఊళ్ళో కొస్తుంది.

గొల్లలతూము దాటొస్తున్న బాబ్జీ ఆ పిల్లని చూసి కాస్సేపు కంటి రెప్పలు ముయ్యడం మానేసేడు. ఊపిరి వదలడం కూడా మానేసి అలాగ చూస్తానే ఉండిపోయేడు. ఆ పిల్లని ఇంతకు ముందెప్పుడూ చూళ్ళేదే. ఇంత అందంగా ఉందేటని అనుకుంటా ఆ పిల్ల వెనకాల నడుస్తున్నాడు.


షష్ఠి జరిపించే చింతా రామకృష్ణారెడ్డీ, కర్రిలచ్చారెడ్డీ కూడబలుక్కుని ఆ ఏడాది నౌబత్‌కానా పెట్టించేరు.

గుడి ఎడం పక్కన పదిహేను అడుగుల ఎత్తు సర్వీకర్రల్తో మంచెలాగ కట్టి దాని మీదెక్కి వాయిస్తున్నారు ఎక్కడ్నుంచో వచ్చిన తురకలు. తడిబట్టల్తో గర్భగుళ్ళో కెళ్తున్న ఆడోళ్ళగుంపులో ఆ పిల్లగూడా ఉంది.

రెప్పార్పకండా ఆ పిల్లని చూస్తున్న బాబ్జీ "ఈ వూళ్ళో ఇంత అందమైన మనిషి ఉందని ఇంతకాలం నాకెందుకు తెలవలేదు" అనుకున్నాడు మళ్ళీ.

వారంవారం సంతలో పెట్టే కొట్లతో పాటు లక్క పిడతల దుకాణాలవాళ్ళు, ఈతాకు చాపలమీద రాసులకింద పెట్టి కర్జూరం అమ్మేవాళ్ళు, నువ్వు పప్పుజీళ్ళు దుకాణాలవాళ్ళు ఇంకా గుండాటోళ్ళు, చక్రం ఆటోళ్ళు, మూడు ముక్కలాటోళ్ళు, సువేగాబండిమీద మైక్ పట్టుకుని కూర్చుని అరుస్తూ హోమియోపతి మందులు అమ్మేవాడు, పూలు పడగలూ అమ్ముతున్న కుర్రాళ్ళు, ఇలాగ రకరకాల జనాల్తో సందడి సందడిగా ఉంది మా సుబ్బారాయుడి షష్ఠి.

ఆ పిల్లగురించి వాకబు చేస్తే ఎర్రమట్టిగోతులు దగ్గరుంటున్న శిరిగినీడినారాయుడి పెళ్ళాం లచ్చుం అక్కకూతురని తెల్సింది. సొంతూరు పాలమూరంట. అసలు పేరు వెంకటేశ్వరిగానీ ఎర్రగా ఉంటదిగాబట్టి అంతా ఎర్రపిల్లనీ పిలుస్తారంట. ఈ మధ్యే వాళ్ళమ్మ తెగులొచ్చిపోతే ఏకూలి పనన్నా చేసుకుందారని పిన్ని లచ్చుం ఇంటి కొచ్చిందంట.



లచ్చుం లోవరకంతో ఇదవుతున్న కిందకులపోళ్ళ పిల్ల అనేసరికి మరీ లోకువ గట్టేసిన బాబ్జీ, అయితే "దీన్ని ఉచ్చులోకి లాగడం చాలా వీజీ" అనేసి నవ్వేసుకున్నాడు.

సందకాడ మంచి బట్టలేసుకుని తన ఈడు పిల్లల్తో మళ్ళీ కనపడింది ఎఱ్రపిల్ల.

తను నవ్వితే తిరిగి నవ్వలేదు.

రాత్రయింది.

చలి.

సుబ్బారాయుడి షష్టంతా ఇలాయిబుడ్లూ, పెట్రోమాక్స్‌లైట్ల మయమైపోయింది.

తక్కిన ఆడపిల్లల్తో ఆషష్టిలో తిరుగుతున్న ఎఱ్రపిల్ల కాలిమడం తొక్కేడు బాబ్జీ.

పట్టించుకోలేదు.

మోచేతి దగ్గర గిల్లేడు.

అంత చీకట్లోనూ కళ్ళెఱ్ర జేసి చూసింది.

జబ్బమీద గిల్లేడు.

కాండ్రకించి ఊమ్మేసింది.

బాబ్జీ మొకం మాడిపోయింది.

* * *

తాపీమేస్త్రి చిన్నం రామారెడ్డి దగ్గర పైపనిలోకి చేరిన ఎర్రిపిల్ల నాగా లేకండా ప్రతిరోజూ వెళ్తుంది.

ముచ్చుమిల్లి సావరంలో రెండతస్తుల మేడ పని జరుగుతుంది. పనైపోయాకా మగోళ్ళంతా సైకిళ్ళ మీదెళితే పైపనిచేసే ఆడోళ్ళంతా కాలవ గట్టట్టుకుని పసలపూడి లాకుల వేపొస్తున్నారు.

ఈలోపల ఇద్దరు ముగ్గురు జనాన్నేసుకుని దిగిపోయిన బాబ్జీ, ఎర్రిపిల్ల మీదికి కలబడ్డాడు.

ఏమాత్రం లొంగలేదు సరిగదా ఎదురుతిరిగింది ఎర్రిపిల్ల. దాంతో తక్కిన ఆడోళ్ళంతా ఎదురు తిరిగేరు.

పనవ్వలేదు సరిగదా పెద్ద పెంటయిపోడంతో బాబ్జీ వాడి మనుషులు అర్జంటు పనున్నట్టు పొలం గట్ల మీంచెళ్ళి పోయేరు.

అక్కడితో ఆక్కుండా తగువు ఊరి పెద్దల మధ్య పెట్టింది ఎర్రిపిల్ల.

పంచాయితీ ఆఫీసు అరుగుల మీద కూర్చున్న పెద్దల మధ్యలోంచి దిగిన ప్రెసిడెంటు మందారెడ్డి ''ఇంకెప్పుడూ ఇలాంటి ఎదవ పని చెయ్య''నని ఎర్రిపిల్లకి చెప్పమన్నాడు బాబ్జీని.

చెప్పేసి తలొంచుకుని వెళ్ళిపోయేడు బాబ్జీ.

ఆ తర్వాత,

ఉంచుకుంటాను, ఉంచుకోడమేగాదు ఎకరం పల్లపు పొలంకూడా రాసిస్తాను రాంపురం సప్పిడోరిసావరంలో ఇల్లు అద్దెకి తీసిస్తాను. రెండు నెల్లకీ బస్తా బియ్యం పంపిస్తాను. కర్చులకి నెలకో నూటయాభై ఇస్తాను. ఎవంటదో కనుక్కోమని కత్తుల సూరిబాబుతో కబురెట్టాడు బాబ్జీ. పేటపేటంతా అల్లరి చేసేసింది ఎర్రిపిల్ల.

లాకుల దగ్గర చింతచెట్లకింద కత్తుల సూరిబాబుతో పాటు మందుగొడ్తా ''ఇదేంట్రా...ఎన్నో పందాలు గెల్చిన నా బతుకిలా అయిపోంది? కొంపదీసి ఈ ఎర్రిపిల్ల విషయంలో ఓడిపోతానంటావా?'' అంటా చాలా ఇదయిపోయేడు బాబ్జీ.

* * *

బసివేశ్వరుడు వూళ్ళో దేవాంగులకి కులదైవం. పెరుగునుయ్యి పక్కన చింతలపూడి మల్లన్నగారు శంకుస్థాపన చేసి మొదలు పెట్టిన ఆ గుడి ఎందుకో తెల్దుగానీ అర్ధాంతరంగా ఆగిపోయింది. గుడి పూర్తవ్వకపోవడం వల్లో ఏంటోగానీ వూళ్ళో చేనేత పని చేసుకునే వాళ్ళ పని ఏమాత్రం బాగోలేదు. దాంతో ఊళ్ళో వున్న పద్మసాలీలూ, కర్ణిమూర్తులూ ఆ గుడి పని మొత్తం పూర్తి చేసి ఫలానా ఆయన చేత గర్భగుడిలో మూల విరాట్టుని ప్రతిష్ఠాపన చేయిద్దాం అనుకుని కొత్త సంతపేటలో తాపీ పని చేసే చిన్నవోరి ఇంటికెళ్ళి ''ఆ గుడి పని పూర్తి చేసి పెట్టాలి రెడ్డిగారూ అయితే దేవుళ్ళ బొమ్మల్తో పాటు గుడి నాలుగు పక్కలా నాలుగు జోడాల బూతుబొమ్మలు కూడా చెయ్యాలి'' అన్నాడు.

''ఆ బొమ్మల పని మాకు రాదు. వాటికి, పెద్దాపురం మేస్త్రుల్ని పిలిపించు కోవాల్సిందేనండీ'' అన్నాడు చిన్నం అబ్బులు.

''కాంట్రాక్టు ఇచ్చేస్తాం. అవన్నీ మీరు చూసుకోండి'' అనెళ్ళిపోయేరు.

పసలపూడి నించి పెద్దాపురం వెళ్ళిన చిన్నం వీర్రాఘవరెడ్డి తాలూకు మనుషులు గున్నాబత్తుల రంగాచారితో బేరసారాలాడి

తీసుకొచ్చేరు. అయితే శాస్త్రాలు చదువుకున్న రంగాచారికి లేని అలవాటు లేదు. పొద్దోతే సీసా కావాలి. ఆడోళ్ళంటే పిచ్చి.

ఒకరోజు లాకుల దగ్గర కత్తుల సూరిబాబుతో పాటు మందుగొడ్తున్న బాబ్జీ పరిచయం అయ్యేడు రంగాచారికి.

అలా నాలుగుసార్లు కలిసేసరికి ఫ్రెండ్షిప్ ముదిరింది.

ఒకరోజు తనలోపలి బాధంతా చెప్పుకుని ''ఆ ఎర్రపిల్ల నిన్ను తీసుకొొచ్చిన ఆ చిన్నం రాఘవరెడ్డిగారి దగ్గర పనిచేస్తుంది'' అన్నాడు.

''ఆ పిల్లనీకు లొంగే ఏర్పాటు చేస్తే నాకేమిస్తావ్'' అన్నాడు గున్నాబత్తుల రంగాచారి.

''అంబటిపాలెంలో నాకు పాతికెకరాల మాగాణి ఉంది. అందులో ఎకరం నీకు రాసేస్తాను'' అన్నాడు బాబ్జీ.

''అలాగొద్దులేగానీ లక్షరూపాయల రొక్కం ఇయ్యగలవా?'' అన్నాడు.

''ఓవల్ రైటన్నాడు?'' బాబ్జీ.

* * *

బసివేశ్వరుడి గుడి చుట్టూ మంచెలాంటిది కట్టించి లోపల పనిచేస్తున్న వాళ్ళు బయటికి కనబడకండా చుట్టూ తాటాకుల్తో కప్పించేసిన గున్నాబత్తుల రంగాచారి, రాఘవరెడ్డిని కల్సి రేపట్నుంచి పని మొదలెడ్తున్నాను. నా దగ్గర పైపనికి ఎర్రపిల్లని పంపమన్నాడు.

పైపని అంటే మేస్త్రికి సిమ్మెంటు ఇసకా కలిపిన మాలుని గమెళాతో అందివ్వడం నీళ్ళు మొయ్యడం. ఇటుకలు తేవడం లాంటి పన్లు. ఆ పనికి ఆడోళ్ళే ఎక్కువుంటారు. వాళ్ళంతా మేస్త్రి చెప్పుచేతల్లో ఉంటారు. రెండో ఆట కెళ్దామే అంటే వెళ్ళాలి. దార్లో ఆతోటలో తొంగుందాం అంటే తొంగోవాలి. మేస్త్రి ఏం చెపితే అది చెయ్యాలి.

పని మొదలెట్టిన రంగాచారి పక్కనే కూర్చుని అడిగినియ్యి అందిస్తున్న ఎర్రపిల్లకి చెప్పడం మొదలెట్టాడు. ''ఇవ్వాళ నేను పద్మినీ జాతి స్త్రీ పాంచాల జాతి యువకుడితో సంభోగం జరిపే బొమ్మ చేస్తున్నాను. పద్మినీ జాతి స్త్రీ తామర మొగ్గలాగ సుతిమెత్తగా ఉంటుంది. ముక్కు నువ్వు మొక్క పూచే పువ్వులాగ, చన్నులు మారేడు పళ్ళలాగ ముచ్చటగా ఉంటాయి. పిక్కలు ఏనుగు తొండాల్లాగ, మీగాళ్ళు తాబేళ్ళలాగా ఉంటాయి. మదన మందిరం తామర రేకులాగ చక్కటి ఆకారంలో ఉంటది. పాంచాల జాతి పురుషుడ్ని ఇష్టపడుతుంది. రాత్రి నాలుగో జాము అంటే తెల్లవారు ఝామున రతివేళ జరపడం చాలా ఇష్టం ఈమెకి. రతి చేస్తున్నప్పుడు పరవశురాలై పోయి తన రొమ్ములకి గాఢంగా హత్తుకుంటుంది. ఆమె రతి జలం పద్మం ఎలాంటి సువాసన కలిగి ఉంటుందో అలాంటి సుగంధం కలిగి ఉంటుంది''.

అయిదురోజులు గడిచాయి.

పద్మినీజాతి స్త్రీ పాంచాల జాతి పురుషుడూ రతిలో పాల్గొంటున్న బొమ్మ పూర్తి చేసేడు గున్నాబత్తుల రంగాచారి. చూస్తున్న ఎర్రపిల్ల నోట్లోంచి మాట రాడం మానేసింది ఇన్నాళ్ళ నించీ ఆ పద్మినీ జాతి మనిషిని ఎలాగైతే వర్ణించాడో అచ్చం అలాగే ఉందా బొమ్మ.

రాత్రయింది.

నవారుమంచం మీద పడుకున్న ఎర్రపిల్లకి నిద్ర రావడం లేదు. ఎప్పుడూ లేంది ఏవేవో ఆలోచనలు జొరం వచ్చినట్టు ఒళ్ళంతా వేడెక్కడం ఎప్పటికో కోడి కూసేవేళకి పట్టింది నిద్ర.

పనిలో కొచ్చిన ఎర్రపిల్ల ముఖం కేసే చూసేడు రంగాచారీ నిద్రలేనట్టు ఎర్రగా ఉన్నాయి కళ్ళు. కాస్సేపు తేరపార జూసి ''ఇవేళ చిత్రిణి జాతి స్త్రీ రతిలో పాల్గొనే బొమ్మ మొదలెడతాను'' అని పని మొదలెడ్తూ ''ఈ జాతి స్త్రీకి నడుం సన్నగా ఉంటుంది. చన్నులూ

పిరుదులూ చాలా పెద్దవి. గుండ్రటి పిక్కలు శంఖంలా మూడు రేఖలు కలిగి ఉంటుంది కంఠం. ఈ స్త్రీ మదన గృహం గుండ్రంగానూ, లోతుగానూ ఉండి ఎక్కువగా జలం ఊరుతూ తాకితే మెత్తగా ఉంటుంది. చౌశీతి బంధాలతో చిత్ర రతులు చెయ్యాలని కోరుతుంది. కొత్తవాళ్ళని కోరుతుందిగానీ ఎవరికీ ఓ పట్టాన లొంగదు. సృష్టికార్యం గాఢంగా జరిపితే మనసిచ్చి కరిగిపోతుంది. రతి సమయంలో పదే పదే నడుం పెకెత్తుతూ కిందా మీదా అవుతుంది. మగాడ్ని తొడల్తో నొక్కి పట్టి తిరగేసి పైకొచ్చి తనే ఉపరతికి సంక్రమిస్తుంది''.

నాలుగయిదు రోజులయ్యాయి.

చిత్రిణి జాతి మనిషి మగోడితో శృంగారంలో మునిగున్న బొమ్మని పూర్తి చేసేడు. దాన్నే చూస్తున్న ఎర్రపిల్ల కళ్ళు మూయ్యలేదు. తక్కువోడు కాదు ఆ బ్రహ్మంగారు. ఇన్నాళ్ళు ఎలాగ వర్ణించాడో అచ్చు గుద్దినట్టు చేసేసేడే బొమ్మ అనుకుంది ఎర్రపిల్ల.

రాత్రిమంచం మీద దొర్లుతున్న ఎర్రపిల్లకి ఆ రాత్రికూడా నిద్ర పట్టలేదు. మునుపెప్పుడూ లేని కొత్తకొత్త ఆలోచన్లు నిద్ర పట్టినట్టే పట్టి మళ్ళీ మెలుకువ వచ్చేస్తుంది. నిద్ర పట్టినప్పుడల్లా ఏదో కల ఆ కలలో రంగాచారి కనిపిస్తున్నాడు. మళ్ళీ మెలుకువ వచ్చేస్తుంది. తెల్లవారు ఝామున కోళ్ళు కూసేదాకా ఇలాగే గడిచింది.

''శంఖినీ జాతి స్త్రీకి రాత్రి మూడో జాములో సంభోగం అంటే చాలా ఇష్టం తెలుసా... పురుషాయితం అంటే పడి చస్తుంది'' మర్నాడు అలా మొదలెట్టాడు గున్నాబత్తుల రంగాచారి.

పురుషాయితం అంటే ఏంటని అడిగిన ఎర్రపిల్ల ప్రశ్నకి సమాధానం చెప్పి ఇక వర్ణించడం మొదలెట్టాడు. శంఖినీ జాతి స్త్రీ దేహం చాలా ఒడ్డూ పొడుగు ఉండటమే గాకుండా బాగా బలిసి కూడా ఉంటుంది. శరీరాన్ని ముట్టుకుందామంటే వేడిగా ఉంటుంది. నడుం సన్నగా, పాదాలు మెత్తగా ఉండవు. కంఠం శంఖం లాగుంటుంది. చూపులు వక్రంగా ఉంటాయి. ఒత్తుగా నల్లగా తీర్చినట్టుంటాయి కనుబొమ్మలు. కుచాలు మరీ లావుగా ఎత్తుగా ఉంటాయి. మదన మందిరం అడివిలాగ దట్టమైన వెంట్రుకల్తో నిండిపోయి ఉంటది. సంభోగ సమయంలో రతిజలం ఊరడం చాలా తక్కువ. రతిలో మాటిమాటికీ మదన మందిరం చూపెడుతూ ఉంటుంది.

రంగాచారి వర్ణిస్తుంటేనే అదో రకమైన జ్వరంతో ఊగిపోవడం మొదలెట్టింది ఎర్రపిల్ల.

వారంలో పూర్తిచేసిన ఆ బొమ్మని చూసి మతి పొగొట్టుకుంది.

రాత్రికి ఇక సరేసరి,

స్తనాలు కుండల్లాగ మరీ లావుగా ఉంటాయి. పెద్ద తొడలు పెద్ద పెద్ద కళ్ళు కపటం తెలీని మనిషి తియ్యటి మాటలకి మెత్తబడి పోతుంది. ఎంతో గాఢంగా సంభోగం చేస్తే గానీ తృప్తి పడదు. అందంగా బలిసి ఉన్న పురుషుల్ని ఇష్టపడే ఈ హస్తినీ జాతి స్త్రీ రాత్రి రెండో జాములో రతి చెయ్యమని గొడవ చేస్తుంది.

ఎలా అయితే వర్ణించాడో అచ్చం అలాగే బొమ్మలు తయారు చేస్తా ఆ మర్నాటినించీ అష్టవిధనాయికల్ని వర్ణిస్తూ బొమ్మల్ని చేస్తూ రోజుకో విధంగా ఆ ఎర్రపిల్లలో మార్పుని తీసుకొస్తున్న రంగాచారి ''బూతు అపవిత్రమైన పని కాదు. బూతు లేకపోతే సృష్టిలేదు. ఎనభైనాలుగు లక్షల జీవరాశిలో బూతు లేకుండా ఏ ఒక్కటీ పుట్టలేదు. బూతుకు కావాల్సిన రసాయనిక తతంగం శారీరకంగా జరగకపోతే జీవోత్పత్తి జరిగే అవకాశమే లేదు'' అన్నాడు.

ఇక నిద్ర కరువైపోతుంది ఎర్రపిల్లకి. ఏవేవో కలలు. అన్నీ శృంగారానికి సంబంధించినవే.

ఇన్నాళ్ళు చాలా నిగ్రహంతో ఉన్న ఎర్రపిల్లకి ఇక తన వల్ల కాడం లేదు.

ఒకానొక అమావాస్యరోజు ''సర్వాయతోటలో కెళ్ళే దారిలో బోరింగుపెడ్డుంది కదా? ..అందులో కల్లుకుందారేంటి ఇవ్వాళ రాత్రి?'' అనడిగాడు రంగాచారి.

అలాగే అన్నట్టు తలూపిన ఎఱ్రపిల్ల ఆ రకం జ్వరంతో ఊగిపోతా ఆ రాత్రి ఎక్కడ తప్పటడుగు వేసేస్తదా అన్నట్టుంది.

''రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకి ఫలానా చోటి కొచ్చెయ్యి అని బాబ్జీకి కబురెట్టిన రంగాచారి ఆ ఎఱ్రపిల్లతో మొట్టమొదటి తడవ నేను తర్వాత బాబ్జీ''అనుకున్నాడు ఖుషీగా.

రాత్రయింది.

పొద్దుట్నుంచీ మబ్బుల్తో ఉన్న ఆకాశం, ఇక కురవడం మొదలెట్టింది.

కాసేపు కురిసి ఆగిపోద్దిలే అనుకుంటే గంగాళాలు దిమ్మరించినట్టు కురుస్తానే ఉంది.

ఒకటే హోరు.

ఒకటే గాలి.

ఎవరూ ఎప్పుడూ ఎరగనంత వర్షం.

లాకుల దగ్గర ముసలి చింత చెట్లన్నీ పడిపోతున్నాయి. కొబ్బరిచెట్లయితే మెలికలు తిరిగిపోతున్నాయి. తడిసిపోతున్న పాత ఇళ్ళు కూలి పోతున్నాయి. వాతావరణమలా తయారుకాడంతో ఊళ్ళో ఎవరికీ నిదరల్లేవు.

మర్నాడూ మూడోనాడూ అలాగే ఉంది.

దవిళేశ్వరం దగ్గర గోదావరి పొంగడంతో లాకు లెత్తేసేరంట. దాంతో గోదావరి కాలవలు పొంగి ఊళ్ళో కొచ్చేస్తున్నాయి నీళ్ళు. గూటిపడవలూ, ముగ్గు పడవలూ, రవాణా పడవలూ అన్నీ ఊళ్ళోకి కొట్టు కొచ్చేస్తున్నాయి. మేడలున్నోళ్ళుపై అంతస్తుల్లోకీ, లేనోళ్ళు ఇంటి వాడపిల్లి పెంకుల కప్పుల మీదికీ ఎక్కేసి కూర్చున్నారు. కొందరయితే నిద్రగన్నేరు చెట్లెక్కి కొమ్మల మీదుండి పోయేరు.

మూడో నాటికి బసివేశ్వరుడి గుడికి సగానికి పైగా వచ్చేసినియ్యి నీళ్ళు.

ఆ వరద వారం రోజులు దాకా వదల్లేదు మమ్మల్ని. మా వూళ్ళో పాపాల్ని కడుక్కుంటూ పోతున్న వరద నీళ్ళతో పాటు ఏ పక్కకో కొట్టుకుపోయిన గున్నాబత్తుల రంగాచారి మళ్ళీ మాకెవరికీ కనపడలేదు.

పవిత్రమైన ఎఱ్రపిల్ల పాడయిపోవడం ఏమాత్రం ఇష్టం లేదు ప్రకృతికి.

* * *